క్లుప్తంగా

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

తగరపువలస: భీమిలి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుంది. సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఎంపీడీవో పి.వెంకటరమణ కోరారు.

సీఎం కప్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు అనిట్స్ విద్యార్థులు



బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీరామకృష్ణ

తగరపువలస: మే ఒకటి నుంచి 5 వరకు తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి సీఎం కప్ బాస్కెట్ బాల్ పోటీలకు సంగివలస అనిట్స్ విద్యార్థులు టి.వెంకట విశ్వాస్, ఆర్.మహితి ఎంపికయ్యారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో డేటా సైన్స్, ఆర్టిఫిషీయల్ ఇంటెలిజెన్స్‌కు చెందిన ఈ ఇద్దరు విద్యార్థులను ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ, విభాగాధిపతి ఎం.శ్రీరామమూర్తి, క్రీడా దర్శకుడు కె.వేణుగోపాల్ అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థులతో ఎంఈవో బాలామణి

కొమ్మాది: రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహిస్తోందని, సౌకర్యాల కల్పనతోపాటు నాణ్యమైన విద్య అందిస్తోందని ఎంఈవో కె.బాలామణి అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి పాతపరదేశిపాలెంలో గల ఎమ్‌పీపీ స్కూల్‌లో బుధవారం యాన్యువల్ డే వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు – నేడు పథకం ద్వారా ఎన్నో పాఠశాలలు కొత్త రూపు సంతరించుకున్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాయుడు, సాడి రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



గొల్లపాలెం పాఠశాలలో అందజేసిన వస్తువులతో విద్యార్థులు

భీమునిపట్నం: గొల్లపాలెం ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఐఐహెచ్‌వైఏ ఫౌండేషన్ నిర్వాహకులు స్టేషనరీ, పుస్తకాలు, స్నాక్స్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా తమరాపల్లి అమిత రోయల్ పిల్లల సంరక్షణ, బ్యాడ్ టచ్, గుడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సంస్థ ప్రతినిధులు టి.శ్రీకాంత్, బోని గురుమూర్తి, బోని పైడిరాజు, ఉపాధ్యాయులు జి.కిరణ్, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

శిథిల రోడ్డుతో అవస్థలు



పాత పరదేశిపాలెంలో శిథిలమైన రోడ్డు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు పాత పరదేశిపాలెంకు చేరుకునే సీసీ రోడ్డు శిథిలమైంది. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి అనుకుని జగనన్న కాలనీ నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఈ రోడ్డు శిథిలమవ్వడం ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

అండర్‌పాత్‌వే పూర్తికాక ఇక్కట్లు

జాతీయ రహదారిపై ప్రమాదకరంగా వెల్లంకి వాసుల ప్రయాణం



అసంపూర్తిగా ఉండిపోయిన అండర్‌పాత్ వే



తొలగించిన గ్రిల్ నుంచి వెళ్తున్న వెల్లంకి గ్రామస్తుడు

ఆనందపురం : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న గ్రామాలకు గల అనుసంధాన రోడ్లు బంద్ అయ్యాయి. దీంతో ఒక వైపు నుంచి మరో వైపు వెళ్లడానికి ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయ్యి వాహనాల రాకపోకలు సాగుతున్నా వెల్లంకి గ్రామం వద్ద నిర్మించ తలపెట్టిన అండర్ పాత్‌వే పనులు మాత్రం ముందుకు సాగలేదు. స్థల సమస్య ఉందంటూ జాతీయ రహదారుల అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో వెల్లంకి గ్రామస్తులు అడ్డదారిలో రాకపోకలు సాగిస్తున్నారు. జాతీయ రహదారికి దక్షిణం వైపు వెల్లంకి గ్రామం ఉండగా గ్రామస్తుల పొలాలతోపాటు శ్మశాన వాటిక ఉత్తరం వైపు ఉన్నాయి. కాగా గతంలో ఉన్న జాతీయ రహదారిపై గ్రామం వద్ద ఆవల వైపు వెళ్లడానికి మార్గం ఉండేది. జాతీయ రహదారిని ఆరు లైన్లు రహదారిగా విస్తరించిన సమయంలో వెల్లంకి వైపు సర్వీసు రోడ్డుని ఏర్పాటు చేశారు. ఆ రోడ్డు ఇటు ఆనందపురం వైపు రావడానికి, అటు తగరపువలస వైపు వెళ్లడానికి మాత్రమే ఉపయోగపడుతోంది. కానీ గ్రామస్తులు హైవేకి ఆవల వైపు వెళ్లడానికి వీలుపడలేదు. దీంతో చుట్టూ సుమారు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి గ్రామస్తులు పొలాలకు చేరుకోవాల్సి వస్తోంది. అలాగే ఆత్మీయుల అంతిమ సంస్కారాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఇబ్బందులను అధికారులకు గ్రామస్తులు తెలియజేయగా వెల్లంకి వద్ద అండర్‌పాత్‌వే ఏర్పాటు చేశారు. రోడ్డు కింద భాగం నుంచి సొరంగం ఏర్పాటు చేసి విడిచిపెట్టేశారు. దీని వల్ల రాకపోకలకు అవకాశం లేకపోవడంతో గ్రామస్తులు తప్పనిసరి పరిస్థితులలో గ్రామానికి వెళ్లే రహదారి తిన్నగా ఆరు లైన్ల రహదారిపై ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ని తొలగించి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఆరులైన్ల రహదారిపై వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను తొందరగా పూర్తి చేసి అండర్ పాత్‌వేని వినియోగంలోకి తీసుకురావాలని వెల్లంకి గ్రామస్తులు కోరుతున్నారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థినులు



వి.శ్వేతా కుమారి (977, ఎంపీసీ)



సోమేల దీప్తిఫ్లారెన్స్ (976, ఎంపీసీ)



బి.మేఘన (958, బైపీసీ)

మధురవాడ: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మారికవలసలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల సంక్షేమ గురుకుల ప్రతిభా పాఠశాల విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచారు. రెండో సంవత్సరం పరీక్షా ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించారు. ఎంపీసీలో వంజారి శ్వేతా కుమారి 977 మార్కులు, సోమెల దీప్తిఫ్లారెన్స్ 976, సాధించి అగ్రస్థానంలో నిలిచారు. బైపీసీలో బొడ్డ మేఘన 958 మార్కులు, మరో 11 మంది 950కి పైగా మార్కులు, 22 మంది 900కిపైగా సాధించారు. ప్రథమ సంవత్సరంలో 81 మంది విద్యార్థులకు 76 మంది ఉత్తీర్ణత సాధించినట్లు (94 శాతం) ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు చెప్పారు. ఎంపీసీలో పత్తిక శ్రావ్యలక్ష్మి, కొట్టిక దీపిక 457 మార్కులు, సెగ్గి తేజస్విని 450 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో 20 మంది 400పైగా మార్కులు సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థినుల సత్తా

భీమునిపట్నం: ఇంటర్ ఫలితాల్లో భీమిలి కేజీబీవీ విద్యార్థినులు సత్తా చాటారు. 32 మంది పరీక్షలు రాయగా 25 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. బైపీసీ సెకండ్ ఇయర్‌కు చెందిన పి.లహరి 960/1000 మార్కులు సాధించింది. ఐ.ధనలక్ష్మి 947/1000, పైలా పూజిత 946/1000 మార్కులు సాధించారు.



లహరి (960, బైపీసీ)



పి.దేవి (965, ఎంపీసీ)

పద్మనాభం కస్తూర్బాలో 64 శాతం ఉత్తీర్ణత

పద్మనాభం: పద్మనాభం కస్తూర్బాలో ద్వితీయ ఇంటర్ ఎంపీసీలో 64 శాతం ఉత్తీర్ణత లభించింది. 39 మందికి 25 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలలో అత్యధికంగా గొలుగొండకు చెందిన పోతిన దేవికి 965 మార్కులు వచ్చాయి. తొమ్మిది వందల మార్కులకు పైగా ఏడుగురు, ఎనిమిది వందల పైగా తొమ్మిది మంది సాధించారు. దేవి తండ్రి నాగేశ్వరరావు వ్యవసాయం చేస్తున్నారు. తల్లి లక్ష్మి గృహిణి. ప్రథమ ఇంటర్‌లో గేదెల మానస 421/470 మార్కులు సాధించింది.

శ్రీబాసర విద్యార్థుల ఉత్తమ ఫలితాలు

తగరపువలస: శ్రీబాసర విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకు ముని శ్రావణి, పి.వెంకటలక్ష్మి 464, కె.చిరంజీవి 463, పి.సాయినవ్యశ్రీ, ఆర్.కోమలి, ఎస్.ఊర్మిళ 462, కె.శృతి 460, బైపీసీలో 440 మార్కులకు పి.తనూజ్‌కుమార్, బి.ఎస్.కె.తేజస్విని లకు 428 వచ్చాయి. సీఈసీలో సీహెచ్ సుప్రియకు 500కు 477 మార్కులు వచ్చాయి. ఫైనల్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీలో వెయ్యికి కాపు మౌనిక 986, అంగ నిహారిక, ఎం.అశోక్ 985, కె.అభిశ్రీ 984, టీఎస్‌వీ గణేష్ 982, టి.నవ్య 980 మార్కులు సాధించారు. బైపీసీలో కొల్లి శృతి 983, ముని పావని 970 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్ పూడి రమేష్, ప్రిన్సిపాల్ వీవీడీ రమేష్ తదితరులు అభినందించారు.

ఇంటి పట్టాల క్రమబద్ధీకరణ ప్రారంభం



శాశ్వత పట్టా అందిస్తున్న ఆర్‌డీవో భాస్కరరెడ్డి, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాణి సుస్మిత

భీమునిపట్నం: ప్రభుత్వం గతంలో జారీ చేసిన 388 జీవో ప్రకారం ఇంటి పట్టాలు ఉన్నవారు వాటిని క్రమబద్ధీకరించుకుని శాశ్వత పట్టా పొందే కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. దీన్ని ఇక్కడి స్మిత్ వీధి సచివాలయం వద్ద ఆర్‌డీవో ఎస్.భాస్కరరెడ్డి, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాణి సుస్మిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో భాస్కరరెడ్డి మాట్లాడుతూ గతంలో పట్టాలు పొందినవారు తమ పరిధిలోని సచివాలయాలకు వెళ్లి వాటిని క్రమబద్ధీకరించుకుని శాశ్వత పట్టాలు పొందవచ్చని సూచించారు. అవసరమైతే పట్టాల్లో పేరు, చిరునామా మార్పులు చేసుకోవడంతోపాటు చనిపోయినవారు ఉంటే వారి కుటుంబ సభ్యుల పేరు మీదకు మార్పు చేసుకోవచ్చన్నారు. ఇతర సవరణలు కావాలన్నా చేయించుకోవచ్చని, ఈ అవకాశం మే 25 వరకు ఉంటుందని, అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కొందరు అర్హులకు శాశ్వత పట్టాలు అందించారు. తహసీల్దార్ కె.వేణుగోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికులతో అఖిలపక్ష సమావేశం నేడు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు నుంచి బకాయిలు రావాల్సిన కార్మికులతో మిల్లు గేట్ వద్ద గురువారం సమావేశం నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు బకాయిల కోసం దరఖాస్తు చేసుకున్నవారు, దరఖాస్తు చేయనివారు ఉదయం 9 గంటలకు రావాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఇటీవల జేసీఎల్ కార్యాలయంలో జరిగిన సమావేశం వివరాలు వెల్లడించి భవిష్యత్ కార్యాచరణను వివరిస్తామన్నారు. అంబేడ్కర్ కూడలి నుంచి మిల్లు వరకు కార్మికుల కోసం ఉచితంగా ఆటోలు నడపనున్నట్టు కాంగ్రెస్ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ నాయకులు తెలిపారు.

117 పశువులకు పరీక్షలు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లిలో ఎస్‌వోఎస్ ఆధ్వర్యంలో కుటుంబ బలోపేత కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 117 పశువులకు పశువైద్యాధికారి అనుపమ పరీక్షలు చేశారు. విటమిన్ ఏ ట్యాబ్‌లెట్లు, ఆవులు, గేదెలు యదకు రావడానికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌వోఎస్ ప్రోగ్రాం మేనేజర్ వి.సత్యనారాయణ, కర్రోతు దుర్గరాజు పాల్గొన్నారు.

కార్మికవాడలో పగిలిన పైప్‌లైన్



చావులమదుం రోడ్డులో పైప్‌లైను పగిలి వృథాగా పోతున్న నీరు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కార్మికవాడలోని చావుల మదుం రోడ్డులో పైప్‌లైన్ నుంచి వారం రోజులుగా నీరు వృథాగా పోతోంది. గతంలో పలుమార్లు ఇక్కడ పైప్‌లైన్ పగిలిన కారణంగా వేలాది లీటర్ల నీరు డ్రెయిన్ల ద్వారా పోయింది. కొండపేట గోస్తనీనది తీరాన పంప్‌హౌస్, రిజర్వాయర్ల నుంచి భీమిలి పట్టణ ప్రజల దాహార్తి తీర్చడానికి సరఫరా అయ్యే ఈ పైప్‌లైన్ తరచూ ఎక్కడో చోట పగిలిపోవడం..., నీరు వృథాగా పోతున్నా జీవీఎంసీ కొత్తగా నిర్మాణం చేపట్టడం లేదు. దీంతో రహదారుల పొడవునా పగిలిన పైప్‌లైన్ల కారణంగా గోతులు కనిపిస్తున్నాయి. ఆ మార్గంలో ప్రత్యామ్నాయంగా కొత్త లైన్ నిర్మించాలని తగరపువలస, చిట్టివలస ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

77 మందికి గ్యాస్ కనెక్షన్లు అందజేత



స్టౌ అందిస్తున్న సర్పంచ్ లక్ష్మీ భవాని

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో ఉజ్వల పథకం కింద 77 మందికి సర్పంచ్ మొకర లక్ష్మీ భవాని, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు బుధవారం గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యాస్ కనెక్షన్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్యాస్‌పై వంట చేసుకుంటే కంటికి హాని ఉండదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బొలె అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి గాయత్రి పాల్గొన్నారు.

ఆదర్శనగర్ నెత్తిన సంగివలస మురుగు

ఆక్రమణలతో ముందుకు కదలని వైనం



ఆదర్శనగర్ సచివాలయాల సమీపంలో నిలిచిన మురుగునీరు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 2వ వార్డు సంగివలస, నమ్మివానిపేట గ్రామాల మురుగు నీరు ఆదర్శనగర్ గ్రామం చివరలో నిలిచిపోతోంది. వాస్తవానికి వలందపేట, సంగివలస, నమ్మివానిపేట గ్రామాల నుంచి వాడుక నీరు, వర్షం నీరు ఈ గ్రామాల్లోని గెడ్డల మీదుగా ప్రవహించి ఆదర్శనగర్ వార్డు సచివాలయాల ముందు ఉన్న ఎర్ర కోనేరులోకి చేరుతుంది. కోనేరు నిండిన తర్వాత అదనపు ప్రవాహం ఆ పక్కనే ఉన్న నల్ల కోనేరు మీదుగా భీమిలి రోడ్డు తూముల నుంచి చిట్టివలస పెద్ద చెరువులోకి చేరుతుంది. కానీ ఇటీవల వలందపేట నుంచి ఆదర్శనగర్ వరకు గెడ్డలన్నీ ఎడాపెడా ఆక్రమణదారుల చేతుల్లో చిక్కి మాయమైపోయాయి. తాత్కాలికంగా జీవీఎంసీ మురుగు ప్రవాహానికి ఆదర్శనగర్ వరకు దారి చూపించినా ఎర్ర కోనేరును ఆనుకుని అక్కడి రియల్ ఎస్టేట్ వ్యాపారులు సహజసిద్ధంగా ఉన్న గెడ్డలను మూసివేసి గ్రావెల్‌తో రోడ్డు వేశారు. దీంతో ఆదర్శనగర్‌ను ఆనుకుని దేవదాయశాఖకు చెందిన లంగర్‌ఖానా భూములు మురుగునీటి కుంటలుగా మారిపోయాయి. ఈ కుంటలు దోమలు, పందులకు ఆవాసంగా ఏర్పడి ఆదర్శనగర్ వాసులపై తరచూ దాడులు చేస్తున్నాయి. ఇక వర్షం కురిస్తే ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వాననీటితో ఆదర్శనగర్ చెరువులా మారిపోతోంది. ఈ కష్టాల నుంచి ఆదర్శనగర్ వాసులను గట్టెక్కించేందుకు సంగివలస, నమ్మివానిపేట గ్రామాల్లోని గెడ్డలను ఆధునీకీకరించి పూర్వం వలే ఎగువ ప్రాంతాల నుంచి వర్షం నీరు ఎర్ర కోనేరు, నల్ల కోనేరు మీదుగా చిట్టివలస పెద్ద చెరువులోకి వెళ్లేలా చూడాలని రెండో వార్డు ప్రజలు కోరుతున్నారు.

ఖాతాదారుల ప్రమేయం లేకుండా నగదు మాయం

తగరపువలస: ఖాతాదారుల ప్రమేయం లేకుండానే వారి బ్యాంకు ఖాతాల్లోని నగదు విత్‌డ్రా అయిపోతోంది. సీఎస్‌పీ అవుట్‌లెట్‌ల పేరుతో పలుమార్లు ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా అయిపోతుండడం చూసి ఖాతాదారులు బ్యాంకులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ పరుగులు తీస్తున్నారు. తమ ఫోన్లకు కనీస మెసేజ్‌లు రాకుండా నగదు విత్‌డ్రా జరుగుతుండడంతో విస్తుపోతున్నారు. ఇటీవల ఇటువంటి సంఘటనలు భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా జరుగుతున్నాయి. భీమిలి జోన్ చిల్లపేటకు చెందిన చిల్ల మంగమ్మ అనే మహిళకు భీమిలి ఎస్‌బీఐలో ఖాతా ఉంది. ఈ నెల 18 నుంచి 24 వరకు 8 దఫాలుగా ఆమె ఖాతా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.53,400 కాజేశారు. ఈ మొత్తం ఎనిమిది వేర్వేరు ఖాతాలకు మళ్లించినట్టు బ్యాంకు స్టేట్‌మెంట్‌లో చూపిస్తుంది. అదే గ్రామానికి చెందిన చిల్ల ఈశ్వరమ్మ ఖాతా నుంచి కూడా రూ.10వేలు విత్‌డ్రా అయిపోయాయి. గతంలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన సైబర్ మోసగాళ్లు బ్యాంకు సిబ్బంది పేరుతో ఖాతాదారులకు ఫోన్ చేసి ఏటీఎం కార్డు, పిన్ నంబర్లు తెలుసుకుని ఖాతాల్లోని నగదు కాజేసేవారు. ఇటీవల కొన్ని మొబైల్ యాప్‌లు, ఖాతాదారుల ఆధార్ అనుసంధానమైన బయోమెట్రిక్‌ల ద్వారా ఈ నగదు కాజేస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. సైబర్ క్రైమ్ పోలీసులు బ్యాంకు అధికారులతో కలిసి ఇలాంటి మోసాలకు చెక్ పెట్టాలని ఖాతాదారులు కోరుతున్నారు.

అందుబాటులోకి ఆపరేషన్ థియేటర్



కొత్త భవనంలో సిద్ధమైన ఆపరేషన్ థియేటర్



మరిన్ని సదుపాయాలు కల్పించనున్న ప్రాంతం

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో కొత్తగా నిర్మించిన భవనంలో త్వరలో ఆధునిక సదుపాయాలతో ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న నేపథ్యంలో ఇక్కడ రూ.3.28 కోట్ల వ్యయంతో కొత్త భవనాన్ని నిర్మించారు. అందులో కార్పొరేట్ ఆస్పత్రి తరహాలో సౌకర్యాలు కల్పించి సంవత్సరం క్రితం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో ఒక భాగంలో ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ రూం, జనరల్ ల్యాబ్‌తోపాటు మరికొన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పుడు ఆపరేషన్ థియేటర్ నిర్మాణం పూర్తి కావడంతో త్వరలో అందుబాటులోకి రానుంది. ఇందు కోసం ఎంతో విశాలమైన గదిలో గతంలో లేని విధంగా పలు సదుపాయాలను కల్పించనున్నారు. ఇక నుంచి చాలా వరకు ఆపరేషన్లు ఇక్కడే నిర్వహిస్తారు. ఇలా అన్ని రకాల వైద్య సదుపాయాలు, వైద్యులు అందుబాటులోకి రావడంతో రోగులకు ఎంతో సదుపాయంగా ఉంది.

ఏఎంసీ పాలకవర్గం కొనసాగించాలని వినతి



ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న సూర్యనారాయణ, శ్రీకాంత్ తదితరులు

తగరపువలస: భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవీ కాలం ముగుస్తున్నందున పాలకవర్గాన్ని తిరిగి కొనసాగించాలని కోరుతూ నాయకులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కోరారు. బుధవారం ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డికి సిఫారసు చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యేను వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీకాంత్, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, బోని సన్నిబాబు, తాళ్లవలస ఉప సర్పంచ్ బీఎస్ఎన్ రాజు, పంచాయతీ అధ్యక్షుడు అక్కరమాని అప్పలనాయుడు, చిల్ల హరి కలిశారు.

ఎస్‌డీజీ సర్వేలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2లో సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీ) సర్వేలో నిర్లక్ష్యం తగదని జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి అన్నారు. జోనల్ కార్యాలయంలో వుమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎన్ఎమ్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వెల్ఫేర్ సెక్రటరీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సర్వే సమగ్రంగా, చురుగ్గా చేసి జోన్‌ని అగ్రస్థానంలో నిలపాలని కోరారు.

నెహ్రూ ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్‌లపై సదస్సు



గీతంలో సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

కొమ్మాది: భారత్, అమెరికా దేశాల మధ్య మేధోపరమైన సహకారానికి యూఎస్ – ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ద్వారా భారతీయ పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులకు అందిస్తున్న నెహ్రూ ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్‌లపై గీతంలో బుధవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఎడ్యుకేషన్ ఫౌండేషన్ భారతీయ వ్యవహారాల మేనేజర్ గాయత్రి సింగాల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయులకు బోధన, పరిశోధనలు, విదేశీ భాషల విభాగంలో అందిస్తున్న స్కాలర్‌షిప్‌ల వివరాలు, అర్హతలు, దరఖాస్తు విధానంపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ నళిని బిక్కిన పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ బాలుర హైస్కూల్‌లో బుధవారం భీమిలి అర్బన్, రూరల్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఎంఈవో కేఏ బాలామణి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలపై శిక్షణ ఇచ్చారు. మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ విద్యా కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, పాఠశాల తనిఖీ యాప్‌లపై రిసోర్స్ పర్సన్లు కె.వి.ఎస్.సత్యనారాయణ, షిణగం సత్యారావు వివరించారు. పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పరిశీలనకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. జీసీడీవో బేగం, సర్వశిక్షా అభియాన్ నుంచి ఏఎస్‌వో గీత పాల్గొన్నారు.

40 మందిపై ట్రాఫిక్ కేసులు



కారుషెడ్ కూడలిలో కేసులు నమోదు చేస్తున్న సీఐ సాయి, సిబ్బంది

పీఎం పాలెం : ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. స్థానిక ట్రాఫిక్ సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనం నడుపుతున్న 40 మందిపై కేసులు నమోదు చేశారు. గతంలో నమోదైన చలానాల రుసుము చెల్లించకుండా తిరుగుతున్న 121 ద్విచక్ర వాహనదారులతో అక్కడికక్కడే సొమ్ము కట్టించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారు నగరంలోని ట్రాఫిక్ పోలీసుల నుంచి తప్పించుకోలేరని సీఐ సాయి పేర్కొన్నారు. ఈ డ్రైవ్‌లో స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ మురళీ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు స్ప్రేయింగ్



కృష్ణాపురంలో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో దోమల నివారణకు బుధవారం స్ప్రేయింగ్ చేశారు. గ్రామంలో ఇటీవల ఒకరికి డెంగ్యూ సోకడంతో ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకుని ఇంటికి వచ్చారు. ఈ నేపథ్యంలో వారి ఇంటి చుట్టుపక్కల 70 ఇళ్లకు స్ప్రేయింగ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మొకర లక్ష్మీ భవాని, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రజ్ఞ, హెల్త్ అసిస్టెంట్ అప్పలరాజు, ఏఎన్ఎం అపర్ణ, సువర్ణ, రమణమ్మ పాల్గొన్నారు.